ప్రజాశక్తి
బుధవారం 27 డిసెంబర్ 2023
5
విజయనగరం

29న జాబ్ మేళా

ప్రజాశక్తి-విజయనగరం

నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈనెల 29న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ తెలిపారు. రిలయన్స్ జియో లిమిటెడ్‌లో హోం సేల్స్ ఆఫీసర్, డిజిటల్ సేల్స్ స్పెషలిస్టల పోస్టుల్లో నియామకాలకు శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా జరుగుతుందన్నారు. అభ్యర్థుల వయసు 18 -30 సంవత్సరాల మధ్య వుండాలని, అభ్యర్థులు ఏదైనా డిగ్రీ కలిగి వుండాలన్నారు. నెలకు రూ.15 వేల జీతంతోపాటు అలవెన్సులు ఇస్తారని తెలిపారు. డిజిటల్ సేల్స్ స్పెషలిస్టు పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియమాకాలు చేపడతారని, వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్య, ఇంటర్ ఉత్తీర్ణులై వుండాలని పేర్కొన్నారు. ఈరెండు కేటగిరీ పోస్టులకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.ncs.gov.in వెబ్‌సైట్‌లో జాబ్ సీకర్ లాగిన్‌లో నమోదు చేసుకొని తమ బయోడేటా, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో జిల్లా ఉపాధి

బొబ్బిలిలో నిరసన ర్యాలీ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రాజాంలో నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె

మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన ర్యాలీలు..ధర్నాలు

నిలిచిన పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్,బొబ్బిలి, రాజాం,నెల్లిమర్ల

తమను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సమ్మెకు దిగారు. విజయనగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాంలో విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఆరోగ్యాలు కాపాడుతున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు, డ్రైవర్లకు రిస్క్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. జీవో 30ను సవరించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ముషిడిపల్లి, రామతీర్థాలు, నెల్లిమర్ల పంపుహౌస్, విలీన ప్రాంత కార్మికులకు ఆప్కాస్‌లో చేర్చి జీతాలు, రిస్క్ అలవెన్స్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సబ్బులు, నూనెలు, బట్టలు, చెప్పులు, బ్లౌజులు, పనిముట్లు ఇవ్వాలన్నారు. క్లాప్ వాహనాలు డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించేది లేదని తెలిపారు. సమ్మెకు పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, బి.భాస్కరరావు, రాజు కార్మికులు పాల్గొన్నారు.

బొబ్బిలి పట్టణంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి హామీని అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే అత్యవసర సేవలను కూడా నిలిపివేసి ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అద్యక్ష,కార్యదర్శులు గౌరీష్, జె. రామారావు, నాయకులు వెంకట్, యుగంధర్, జి.శంకరరావు, వాసు, కార్మికులు పాల్గొన్నారు.

రాజాం నగర పంచాయతీలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు.

నెలిమర్లలో నగర పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టివి రమణ మాట్లాడారు. రిటర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ ఆలవెన్స్, డ్రైవర్లకు ఆక్యుపెన్సీ అలవెన్స్ ఇవ్వాలని, బకాయి హెల్త్ అలవెన్సులు, జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు బాబూరావు, హరిబాబు, శ్రీను, సురేష్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో సమ్మెలో పాల్గొన్నకార్మికులు, సిఐటియు నాయకులు

విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నకార్మికులు, యూనియన్ నాయకులు

ఉలిక్కిపడ్డ ఉమ్మడి జిల్లా

- రెండు కరోనా కేసులు నమోదు
- భయాందోళనలో ప్రజలు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు



ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం, డెంకాడ

కరోనా పరిస్థితుల నుంచి పూర్తిగా తేరుకొని ఎవరి కార్యకలాపాల్లో వారు నిమగ్నమైన వేళ మళ్లీ కరోనా కలకకలం మొదలైంది. తాజాగా పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లాలో రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడిజిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జియమ్మవలస మండలం కుందరతిరువాడ పంచాయితీ నీచకవలసకు చెందిన మహిళకు కోవిడ్ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె భర్త ఇటీవలే శబరిమల వెళ్లి వచ్చారు. తమ బంధువులకు ప్రసాదాలు పంచే క్రమంలో బైక్ యాక్సిడెంట్‌లో ఆమె గాయపడ్డారు. వైద్యం కోసం విశాఖ వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కరోనా లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. అక్కడ వైద్య పరీక్షలు చేయగా కోవిడ్ జెఎన్1 కొత్త వేరియంట్ ఉన్నట్లు అనుమానించి నిర్ధారణ పరీక్షలు చేశారు. కరోనా ఉండడంతో వైద్యం అందిస్తున్నారు. ఆమె భర్తకు కూడా పరీక్షలు చేయగా కరోనా లక్షణాలు లేనట్లు గుర్తించారు.

డెంకాడ మండల కేంద్రానికి చెందిన బండారు నారాయణమ్మ (78) కరోనా బారిన పడింది. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె విజయనగరంలో ఓ ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ వైద్యుల సూచన మేరకు ఈనెల 12న విశాఖ కెజిహెచ్‌కు వెళ్లింది. పరీక్షలు చేసిన వైద్యులు కరోనాగా నిర్ధారించారని డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు తెలిపాపు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతుందని తెలిపారు. కరోనా కేసు నేపథ్యంలో జిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కరోనా కొత్త వేరియంట్ ప్రచారం టీవీల్లో, పత్రికల్లో రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మాస్క్ తప్పనిసరి

కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందడంతో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి ప్రజల స్వగ్రామాలకు వస్తుంటారని, ఈ నేపథ్యంలో కేసులు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని, శానిటైజర్ వినియోగించాలని కోరుతున్నారు.

పిఆర్‌సి, ఎరియర్స్ బకాయిల కోసం దశలవారీ పోరాటం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు మోహనరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఆర్‌సి, డిఎ ఎరియర్స్ బకాయిల కోసం దశల వారీ పోరాటాలకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలని యుటిఎఫ్ రాష్ట్రకార్యదర్శి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు.మంగళవారం యుటిఎఫ్ కార్యాలయం లో జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం జిల్లా అధ్యక్షులు జెఆర్‌సి పట్నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ పిఆర్‌సి ఎరియర్లు రూ.6246 కోట్లు, డిఎలు 1,136 కోట్లు, పిఆర్‌సి తరువాత ప్రకటించిన డిఎ రూ.4884 కోట్లు, ఎపి జి ఎల్ ఐ మొత్తం 18,096 కోట్లు, సి పి ఎస్ ఉద్యోగుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన వాటా సుమారు 2500 కోట్లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆద్వర్యంలో ఈనెల 27న తాలూకా కేంద్రాల్లో 6 గంటల ధర్నా, జనవరి 3న విజయనగరం జిల్లా కేంద్రంలో 12 గంటల ధర్నా, రాష్ట్ర కేంద్రంలో జనవరి 9,10 తేదీల్లో 36 గంటల ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ధర్నాలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎ విఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణలో భాగంగా విద్యా సామర్థ్యాలు పెంచేందుకు వెనుకబడిన విద్యార్థులకు అదనపు సమయం బోదించాలని, పాత పెన్షన్ సాధన కోసం జనవరి 28న విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చెయ్యాలని కోరారు, సావిత్రిబాయి పూలే జయంతి సభలను జనవరి 2 నుండి జనవరి 8 వరకు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు మీసాల అప్పులనాయుడు, ఉపాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, కోశాధికారి భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె. ప్రసాదరావు, పి. త్రినాథ్, పి. వాసుదేవరావు, బి. రామునాయుడు, వి. రాధాభవాని ఎన్. సత్యనారాయణ, సిహెచ్ తీరుపతినాయుడు, బి.రాజారావు, ఎస్.శ్రీను, అల్లు శంకరరావు పాల్గొన్నారు.

ఏడో రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

పోరాటానికి అండగా ఉంటాం : ఎమ్మెల్సీలు చిరంజీవి, రఘు వర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఎం జగన్ ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి సమ్మె 7వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట నిరసనలో పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు పాకలపాటి రఘు వర్మ, వేపాడ చిరంజీవి మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా వెళ్లకుండా వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు మాట్లాడుతూ జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. యంటియస్ అమలు చేసివేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి ప్రతి నెలా 1వ తేదీకి వేతనాలు చెల్లించి, వార్షిక బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలని కోరాడు. ఒగ్యులైజేషన్, వేతనాల పెంపు, తక్షణమే బకాయిల చెల్లింపు తదితర సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రాష్ట్ర కార్యదర్శి గురువులు ఉద్యోగులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీరఘువర్మ

అట్టహాసంగా 'ఆడుదాం ఆంధ్ర'

- క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకే
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జిల్లా అంతటా ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడామైదానంలో, పులివేషాలు, కర్రసాము, కత్తిసాము తదితర సంప్రదాయ జానపద కళల కోలాహలం నడుమ పండగ వాతావరణంలో మంగళవారం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. డిప్యుటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ గీతాలాపన అనంతరం పోటీలకు శ్రీకారం చుట్టారు. స్వయంగా తాము కూడా ఆటల్లో పాల్గొని ఉత్సాహపరిచారు. స్పోర్ట్స్ అంబాసిడర్లుగా నియమితులైన కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ పతక విజేత మత్స సంతోషి, జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి శ్రీలక్ష్మి, ప్రముఖ స్కేటింగ్ క్రీడాకారుడు సాయితేజను ఈ సందర్భంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో క్రీడల పరంగా ఇంతటి భారీ కార్యక్రమాన్ని నిర్వహించడం ఇదే తొలిసారని చెప్పారు. ఈ పోటీలవల్ల గ్రామీణ స్థాయి క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుందని చెప్పారు. క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. విజయనగరం జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పతకాలను సాధించాలని కోరారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ఆరోగ్యకర జీవన విధానం కోసం క్రీడలపై ప్రతి ఒక్కరూ మక్కువ పెంచుకోవాలని కోరారు. క్రీడల్లో గెలుపు కంటే, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడం ముఖ్యమని సూచించారు. క్రీడాకారులను భారీ ఎత్తున ప్రోత్సహించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయి నుంచి విజేతలకు నగదు బహుమతులను కూడా ఇస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం ఐదు స్థాయిల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు.

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ, జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల వివరాలను వెల్లడించారు. జిల్లాలో సుమారు లక్షా, 42వేల మంది ఈ పోటీల్లో పాల్గొనడానికి ముందుకు వచ్చారన్నారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలతోపాటు, యోగా, మారథాన్ పోటీలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాముల నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, సచివాలయాల నోడల్ అధికారి నిర్మలాదేవి, సెట్విజ్ సిఇఒ రామ్‌గోపాల్, చీఫ్ కోచ్ అచ్యుత్, వివిధ శాఖల అధికారులు, పలువురు కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి

చీపురుపల్లి : ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను చీపురుపల్లిలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, గరివిడిలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా అన్ని రంగాలలో రాణించాలని చెప్పారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నియోజవర్గ నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఆయా మండలాల నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా కుష్టు ఇంటింటి సర్వే ఈనెల 27నుంచి వచ్చే జనవరి 12 వరకు నిర్వహించనున్నట్లు డిఎంహెచ్ఒ భాస్కరరావు, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ రాణి తెలిపారు. మంగళవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందులో భాగంగా కుష్టు అనుమానితులను గుర్తించేందుకు ఆశా కార్యకర్తలు, వాలంటీర్ ఇంటింటినీ సందర్శించి చర్మంపై ఏర్పడిన మచ్చలు , ఇటీవల వచ్చిన అంగవైకల్యం ఉన్న వారిని గుర్తిస్తారని తెలిపారు. కుష్టు నిర్మూలనకు తగు చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లాలో గత ఏడాది సర్వేలో 112 కేసులు ఈ ఏడాది 106 కేసులు గుర్తించామన్నారు. 2027 నాటికి లెప్రసి కేసులు జీరో శాతం చేయాలన్నదే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం కావున ప్రజలంతా సర్వే లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సచివాలయానికి రూ.10 వేలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో షెడ్యూలు ప్రకారం మ్యాచ్‌లన్నీ జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఎంపిడిఒలను ఆదేశించారు. ఆయా క్రీడలకు సంబంధించి రూపొందించిన షెడ్యూలు ప్రకారమే మ్యాచ్ లు జరగాలని, షెడ్యూలును ఇష్టప్రకారం మార్చడానికి లేదని స్పష్టంచేశారు. ఆడుదాం ఆంధ్ర పోటీలు జరుగుతున్న తీరుపై మంగళవారం సాయంత్రం టెలికాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. జిల్లాలో క్రీడా మైదానాల్లో అవసరమైన కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వసతులు, ఏర్పాట్ల కోసం ప్రతి సచివాలయానికి రూ.10 వేలు మంజూరు చేశామని చెప్పారు.ఆయా మైదానాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, టెంట్‌లు, మైక్ లు, పోటీల బ్యాక్ డ్రాప్ వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు.

దిశా స్టేషన్‌ను ఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం

వార్షిక తనిఖీల్లో భాగంగా దిశ మహిళా పోలీసుస్టేషన్‌ను ఎస్‌పి ఎం.దీపిక మంగళవారం సందర్శించారు. స్టేషన్ ప్రాంగణాన్ని, స్టేషన్ గదులను పరిశీలించారు. కేసుల దర్యాప్తులో భాగంగా సీజ్ చేసిన వస్తువులను ప్రాపర్టీ రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నదీ లేనిదీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తులో ఉన్న సిడి ఫైల్స్‌ను తనిఖీ చేసి దర్యాప్తు అధికారులకు పలుసూచనలు చేశారు. స్టేషన్‌ను ఆశ్రయించే బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలను ప్రత్యేక శ్రద్ధ సహాయపడాలన్నారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సిఐ బి.నాగేశ్వరరావు, ఎస్‌ఐలు లక్ష్మణరావు, శ్యామల, నర్సింహారావు, తదితరులు ఉన్నారు.

రంగా సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వంగవీటి మోహన్ రంగా బడుగు, బలహీనవర్గాలకు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. రంగా 35వ వర్థంతి మంగళవారం స్థానిక జిఎస్ఆర్ కార్యాలయంలో నిర్వహించారు. రంగా చిత్రపటానికి అయ్యలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కోసం జీవించి, వారితో మమేకమై బతికిన రంగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారున్నారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు రాజేష్, పవన్‌కుమార్, వెంకటేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి నిర్వహించే డిపార్ట్ మెంటల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు డిఆర్ఒ ఎస్‌డి అనిత చెప్పారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లపై మంగళవారం తన ఛాంబరులో ఏపిపిఎస్‌సి అధికారులు, జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ఐదు కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, సాయంత్రం 3గంటల నుంచి 5వరకు ఈ పరీక్షలు జరుగుతాయని, 1918 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య పరీక్ష కేంద్రంలో హాజరు కావలసి వుంటుందని చెప్పారు. నిర్ణీత సమయం తర్వాత హాజరైన వారిని లోనికి అనుమతించరని స్పష్టం చేశారు. హాల్‌టిక్కెటుతో పాటు ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపుకార్డుతో అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి హాజరుకావలసి వుంటుందన్నారు. డిపార్ట్‌మెంట్ పరీక్షలకు పుస్తకాలతో సహా అనుమతి వున్న వారు ఎపిపిఎస్‌సి అనుమతించిన ఆధీకృత పుస్తకాలు మాత్రమే తీసుకురావలసి వుంటుందని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని స్పష్టంచేశారు. జిల్లా కేంద్రంలో ఎంవిజిఆర్, లెండి, సత్య, ఐయాన్ డిజిటల్ జోన్, బొబ్బిలి మండలం కలవరాయిలోని స్వామి వివేకానంద ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకోసం రాత పరీక్ష జనవరి 4వ తేదీన ఐయాన్ డిజిటల్ జోన్‌లో జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ డి.ఎన్.మల్లిఖార్జున రెడ్డి, సహాయ సెక్షన్ అధికారి జె.చంద్రరావు, ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వాలంటీర్ల సమ్మె

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల బహిష్కరణ ● ఎంపిడిఒలకు వినతులు

ప్రజాశక్తి-భోగాపురం, సీతానగరం

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల గ్రామ సచివాలయ వాలంటీర్లు సమ్మెకు దిగారు. తమకు రూ.18వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎంపిడిఒలకు సమ్మెనోటీసు అందజేశారు. భోగాపురం మండల కేంద్రంలో 35మంది వాలంటీర్లు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని బహిష్కరించారు. నెలకు రూ.18వేలు వేతనం ఇవ్వాలని కోరుతూ తామంతా సమ్మె చేస్తున్నట్లు ఎంపిడిఒ అప్పలనాయుడుకు నోటీసు అందజేశారు. తమకు కూడా సచివాలయ సిబ్బంది వలే రెగ్యులర్ చేయాలని కోరారు. ఈనేపథ్యంలో పాఠశాల పీడీలతో క్రీడలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది.



ఎంపిడిఒకు సమ్మె నోటీసు అందజేస్తున్నవాలంటీర్లు

పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలో 35 పంచాయతీలకు చెందిన 314 మంది వాలంటీర్లు సమ్మెలోకి వెళ్లారు. మండల కేంద్రంలో వాలంటీర్లు ఎంపిడిఒకు సమ్మె నోటీసు అందజేశారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని బహిష్కరించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా : శివారెడ్డి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చాకివలస ఆర్‌బికెలో కంప్యూటర్‌ను ఇంచార్జ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గత రెండేళ్ల నుంచి ఇంటికి తీసుకువెళ్లి వాడుకుంటున్నట్లు ఎ.రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి ఆరోపించారు. తన సచివాలయం పరిధిలో చాకివలస రైతు భరోసా కేంద్రం ఉందని అన్నారు. ప్రభుత్వ ఇచ్చిన కంప్యూటర్‌ను రైతు భరోసా కేంద్రంలో ఉంచాలని, ఒకవేళ రైతు భరోసా కేంద్రంలో రక్షణ లేనప్పుడు సచివాలయానికి అప్పజెప్పాలి కానీ ఇంటికి తీసుకువెళ్లడం సరికాదని ఆయన అన్నారు. కంప్యూటర్‌ను అప్పగించాలని పలుమార్లు ఆమెకి చెప్పినప్పటికీ అప్పజెప్పలేదన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

వైసిపి యువజన అధ్యక్షుడిగా తూర్పాటి

లక్కవరపుకోట: వైసిపి మండల యువజన అధ్యక్షుడిగా తూర్పాటి అప్పలరాజును నియమిస్తూ రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎంపిపి గేదెల శ్రీనివాసరావు మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా మండల యువజన అధ్యక్షుడిగా ఎన్నికైన అప్పలరాజును వైసిపి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఎంపిపి గేదెల శ్రీనివాసరావు చొరవతో, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తనకు ఈ పదవి లభించిందన్నారు. తమపై పెట్టిన నమ్మకాన్ని ఒమ్ము చేయ కుండా పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో మల్లివీడు సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్, లచ్చింపేట సచివాలయ కార్యదర్శి సత్యనారాయణ, బుడమ శ్రీను, విజయకుమార్, పెద్దిరెడ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

బుద్ధ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సమక్షంలో కేక్ కట్ చేస్తున్న బుద్ధ

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు బుద్ధ అప్పలనాయుడు జన్మదిన వేడుకలకు మంగళవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని కేక్ కట్ చేయించారు. అనంతరం 300 మంది నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ వి.వి చిన్నరామనాయుడు, ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, స్థానిక ఎంపిటిసి టివి. రమణ, సర్పంచులు, ఎంపిటిసిలు, సీనియర్ నాయకులు, కుటుంబీకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ బీమా చెక్కు అందజేత

రేగిడి: మండలంలోని అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన పోరాపు గౌరు నాయుడు మృతి చెందడంతో అతని భార్య పార్వతికి తక్షణ సాయం కింద పదివేల రూపాయలను సర్పంచ్ చుక్క వెంకట్ నాయుడు, వైసిపి నాయకులు గోగుల శంకర్రావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కుటుంబ యజమాని మృతి చెందితే ఆ కుటుంబాన్ని వైఎస్‌ఆర్ బీమా ఆదుకుంటుందన్నారు. వీరితోపాటు పి గణేష్ ఉన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

శృంగవరపుకోట: మండలంలోని గిరి శిఖరమైన దారపర్తి పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగు గిరిజన గ్రామాల్లో 200 కుటుంబాలకు విజయనగరం డిఎస్‌పి గోవిందరావు మంగళవారం దుప్పట్లను పంపిణీ చేశారు. సిఐ బాల సూర్యారావు, ఎస్ఐ లోవరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని దబ్బగుంట జంక్షన్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రస్తుతం చలి ఎక్కువగా ఉందని ఈ తరుణంలో కొండపై నివసిస్తున్న వారికి మరింత ఎక్కువగా ఉంటుందని భావించి వారికి చలిని కాస్తయినా తగ్గించేందుకు తనవంతుగా దుప్పట్లను అందించామని చెప్పారు. స్థానిక గిరిజన యువత మాట్లాడుతూ డిఎస్‌పి నిర్వహించిన ఈ చక్కటి కార్యక్రమం తాము ఎప్పటికీ గుర్తుంచుకుంటామని హర్షం వ్యక్తం చేశారు. పోలీసులు తమ వద్దకు వచ్చి దుప్పట్లు అందించడం చూసిన గిరిజన కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి.

కూలీల జీవన ప్రమాణాలు పెంపొందించాలి

భోగాపురం: ఉపాధి హామీ కూలీల జీవన ప్రమాణాలను పెంపొందించాలని ఎపిఒ మహేదాను ఆదిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐదు పంచాయతీలకు చెందిన ఉపాధి హామీ మహిళా మేటీలకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కూలికి ఏడాదికి వంద రోజులు పని దినాలు కల్పించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా పనులకు వచ్చిన ప్రతి ఒక్కరి హాజరు సక్రమంగా వేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకంలో మండలానికి మంచి పేరు ఉండేలా దాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో, బైరెడ్డి ఎర్రప్పలనాయుడు, ఈసీ శివప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు భవాని, శ్రీనివాస్, మేట్ల ట్రైనర్, పాల్గొన్నారు.

నల్లి సూరిబాబు సేవలు మరువలేనివి

విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లిమర్ల : జరజాపుపేట మాజీ సర్పంచ్ నల్లి అప్పల సూర్య నారాయణ (సూరిబాబు) సేవలు మరువలేనివని నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. మంగళవారం జరజాపు పేటలో మాజీ సర్పంచ్ కీర్తి శేషులు నల్లి అప్పల సూర్య నారాయణ 6 వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు విగ్రహానికి పేరుపేరునా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ సూరిబాబు సర్పంచ్‌గా, కార్మిక నేతగా చేసిన సేవలు మరువలేనివన్నారు. నెల్లిమర్ల జ్యూట్ మిల్ కార్మికుల మంతో కీలక పాత్ర పోషించి సూరిబాబు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆమరణ నిరా హారదీక్ష చేసిన వ్యక్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బొని సత్య వతి, బొని శ్రీ నివాసరావు, నల్లి చంద్ర శేఖర్, అవనాపు సత్య నారాయణ, కిల్లంపల్లి రామారావు, తాళ్ల సన్యాసిరావు, రెబ్బిడి ఉపాధ్యాయులు సుంకరి వాసు దేవరావు, బొలే సత్యనారాయణ, కడలి ప్రకాశ రావు, మద్దిల ప్రసాద్ పాల్గొన్నారు.

297వ రోజు గడపగడపకు

శృంగవరపుకోట: పట్టణంలోని సచివాలయం- 1 పరిధిలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళవారం 297వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపలోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎవైనా సమస్యలుంటే తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటూ, నేరుగా ప్రజలతో కలసి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, కూనిరెడ్డి వెంకటరావు, తలారి సర్పంచ్ అనంత్, నారాయణ మూర్తి, ఆవాల కృష్ణ, మజ్జి శేఖర్, సారిపల్లి గణేష్, యలమంచిలి అప్పలసత్యం, ఉల్లి శంకర్, మోపాడ ఈశ్వరరావు, యలమంచిలి ఈశ్వరరావు, నక్కా నాగరాజు, కొట్టం వెంకటరావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గడ్డి కుప్పలు దగ్ధం

వేపాడ : వల్లంపూడి గ్రామానికి చెందిన సేనాపతి వారి కల్లాల వద్ద సోమవారం రాత్రి ప్రమాదవ శాత్తు గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. అప్రమత్తమైన సేనాపతి గణేష్ అప్రమత్తమై రైతులకు, గ్రామస్తులకు సమాచారమివ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు. అప్పటికే సేనాపతి గంగరాజుకు చెందిన గడ్డి కుప్ప కాలిపోయింది.

ఉరేసుకుని యువకుడు మృతి

జామి: పల్నాడు జిల్లా కుందులూరు పాలెం గ్రామానికి చెందిన ఉషశ్రీ వెంకట ముత్తయ్య మండలంలోని కుమరాంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పై ఎస్ఐ వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాలు ప్రకారం... టార్పాన్లు అద్దెకు ఇస్తూ మండలంలోని ఆర్‌బీపురంలో ముత్తయ్య వుంటున్నాడు. మృతుడు ఒక్కోక్కసారి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుంటాడనీ స్థానికులు చెబుతున్నారు. ఆర్.బీ.పురంలో సోమవారం రాత్రి పెద్ద పెద్ద కేకలు వేస్తూ ఉండడంతో వారికి సంబంధించిన వారు కుమరాంలో అట్టాడ వెళ్లే మార్గంలో చిన్న షాప్‌కు తీసుకెళ్ళి పెట్టారు. తెల్లవారే సరికి దుప్పటితో సెట్టర్‌కి ఉరి వేసుకున్నాడు. మృతుని తల్లి వేమలమ్మ ఫిర్యాదు చేయడంతో ఎస్.ఐ వీరబాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గౌరవ వేతనం మాకొద్దు.. కనీస వేతనాలు కావాలి

ప్లేట్లు మోగిస్తూ అంగన్‌వాడీల వినూత్న నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గౌరవ వేతనం మాకొద్దు.. అని కనీస వేతనాలు అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఖాళీ ప్లేట్లు కొడుతూ వినూత్నంగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మె చేపట్టి 15 రోజులు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమస్యలు పరిష్కారం చేయాలని చేసే వరకు సమ్మె విరమించేది లేదని తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు పి.రఘువర్మ, వి.చిరంజివి సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

మద్దతు తెలిపిన ఎమ్మెల్సీలు రఘువర్మ, చిరంజీవి

విజయనగరం: ప్లేట్లు మోగిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సమ్మెకు మద్దతుగా ఆశావర్కర్ల ర్యాలీ

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి వెంటనే సమ్మెను విరమింప చేయాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి తహశీల్దార్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం చేశారు. తరువాత డిటి కోటేశ్వరరావుకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సుధారాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహన్రావు మాట్లాడారు. కార్యక్రమంలో విజయనగరం అర్బన్ అండ్ రూరల్ ఆశా వర్కర్స్, యూనియన్ నాయకులు మహాలక్ష్మి, వెంకటలక్ష్మి, పద్మ అప్పయమ్మ, వాసవి, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : అంగన్‌వాడీలంతా సమ్మె శిబిరంలో ఖాళీ పళ్లాలు మోగిస్తూ నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం సమ్మె పరిష్కారం దిశగా ఆలోచించకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుభాషిని, సెక్టార్ నాయకులు సన్యా సమ్మ, జ్యోతి, రాములమ్మ, దమయంతి, నారాయణమ్మ పాల్గొన్నారు. ఐద్వా నాయ కులు కృష్ణవేణి, జానపద కళాకారులు సూర్యనారాయణ, బొట్టా తవుడు మద్దతు తెలిపారు.

బొబ్బిలి: అంగన్వాడీల జీవితాలతో ఆటలాడొద్దని అంగన్వాడీలు సిఎం జగన్మోహన్ రెడ్డిని కోరారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఆడుదాం-ఆంధ్ర కాదు...సీఎం జగన్మోహన్ రెడ్డితో ఆట ఆడుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ వైసిపి అధికారం లోకి వస్తే తెలంగాణ కంటే ఎపిలో అంగన్వాడీలకు అదనంగా వేతనాలు ఇస్తామని ఎన్నికల్లో సీఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.పద్మ, పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న శిబిరంలో వినూత్నంగా పోషకాహార వస్తువులు పట్టుకొని కూరగాయలు దండలుగా ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరికి సంఘీబావం ప్రకటించిన సిఐటియు నాయకులు శ్రీనివాసరావు పాల్గొని ఆశా, అంగన్వాడీల సమ్మెలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారి న్యాయమైన కోర్కెల సాధనకు కృషి చేయాలని తహశీల్దార్ సులోచనా రాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు లక్ష్మి, కుమారి, వేనమ్మ, రాధ, మేరీ పాల్గొన్నారు.

బొబ్బిలి: కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

శృంగవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించాలని అంగనవాడీలు సమ్మె శిబిరం వద్ద మంగళవారం పల్లేలతో శబ్దాన్ని చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ చేస్తున్న సమ్మె మంగళవారానికి 15వ రోజుకి చేరుకుందని పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో అంగన్వాడీలు వినూత్న పద్ధతిలో మోకాలు వేసి, పల్లాలను గరిటలు కొట్టి నిరసన తెలియజేశారని చెపారు. ఇచ్చిన మాటను పక్కనపెట్టి అంగన్వాడీలపై దాడికి దిగడం సరికాదని ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ మెంబర్ చేలికాని ముత్యాలు, సిఐటియు అనుబంధం అంగన్వాడి ప్రాజెక్టు లీడర్ డి శ్యామల, డి జయలక్ష్మి, ఏఐటీయూసీ అనుబంధ సంఘ లీడర్స్ వి.మాణిక్యం, సుశీల పాల్గొన్నారు.

జామి : సెల్‌ఫోన్లుకు పూజలు చేసి భజన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కొత్తవలస: స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం కంచాలు కొడుతూ నిరసన తెలిపారు. ప్రాజెక్టు నాయకులు కాకర తులసి మాట్లాడుతూ 'మా కడుపులు కొట్టొద్దని, మా డిమాండ్ అంగీకరించి, ప్రభుత్వం మాకు న్యాయం చేయాలని' కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, ప్రాజెక్ట్ నాయకులు శంకరావతి, పెద్ద ఎత్తున అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఆశావర్కర్ల సంఘీభావం

లక్కవరపుకోట: వివిధ సమస్యలపై ఈ నెల 12 నుండి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మెకు మద్దతుగా మండల ఆశా వర్కర్లు మంగళవారం సంఘీభావం తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో మండల ఆశా వర్కర్లు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ, ఆశా వర్కర్లు దేవి, ఈశ్వరమ్మ, కె కనకమహాలక్ష్మి, వి.అన్నపూర్ణ, ఎం.రాములమ్మ, ఎ.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జామి: అంగన్వాడీల సమ్మె 15వ రోజు వినూత్నంగా సాగింది. నిరసన శిబిరాల్లో తాళాలు వాయిస్తూ, జగన్ ఇచ్చిన సెల్ పొన్లకు పూజలు నిర్వహించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన శిబిరాల్లో అంగన్వాడీ కార్యకర్తల సెల్ పోన్లకు పూజలు నిర్వహిస్తూ, భజనలు చేశారు. నీ సెల్ ఫోన్లకు, నువ్వు ఇచ్చే చీరలకు దండం అంటూ అంగన్వాడీ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేష్ మాట్లాడుతూ రాష్ట్రం ఉద్యమాల ఆంధ్రాగా మారిపోతుందని, ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం కళ్ళు తెరవాలి అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గాడి అప్పారావు, వెంకటలక్ష్మి, విష్ణుఅమ్మ, రామలక్ష్మి, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి, దేవుడమ్మా, ఆదిలక్ష్మి, అధిక సంఖ్యలో వర్కర్స్ పాల్గొన్నారు.

రాజాం: రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్వాడీలు గత 15 రోజులుగా సమ్మె చేస్తుంటే కనబడకపోవడాన్ని వినపడకపోవడాన్ని నిరసిస్తూ రాజాం సమ్మె శిబిరంలో పల్లెలు గరిటలతో పెద్ద ఎత్తున శబ్దం చేస్తూ నిరసన తెలిపారు. వెంటనే సమస్యలు పరిష్కారం చేయాలని నినదించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి గత 15 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా లక్షకు పైగా అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు నిరసన తెలుపుతున్నా కనిపించదా అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉమా కుమారి, శ్రీదేవి, జయలక్ష్మి, సునీత, భారతి, కుమారి, మంగమ్మ, వనజ, చిన్నమ్మడు, పార్వతి, పుణ్యవతి, అరుణ, మీనా పాల్గొన్నారు.

ఎస్‌కోట : మోకాలపై నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

మా జీతాలు మాకివ్వండి

పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి-చీపురుపల్లి

'మా జీతాలు మాకివ్వండి, ప్రతీ రోజు ఉదయం మూడు గంటలకు మేము లేచి పంచాయతీలో పారిశుధ్య పనులు చేస్తున్నాం, మమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు. మా పిల్లా పాపలతో మేము ఏం తిని బతకాలి? ఇది న్యాయమేనా,? ఎందుకు మమ్మల్ని ఇంత చులకనగా చూస్తున్నారు' అంటూ చీపురుపల్లి పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్మికులు గత రెండు రోజులుగా తమకు రావలసిన ఏడు నెలల జీతం చెల్లించాలంటూ పారిశుధ్య పనులకు దూరంగా ఉంటున్నారు. తమకు ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే తామెలా బతకాలి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలను ఎలా చదివించాలంటూ ఆందోళన చెందుతున్నారు. ఏడు నెలలో కనీసం ఐదు నెలలైనా తమకు జీతాలు అందించాలని గత రెండు నెలల నుండి కోరుతున్నప్పటికీ అధికారులెవరూ స్పందించడం లేదని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జీతాలు చెల్లించలేనందును రెండు రోజుల నుండి తాము పారిశుధ్య పనులకు దూరంగా ఉంటున్నామని తమ సమస్యల పరిష్కరించకుంటే తమ యూనియన్లతో చర్చించి సమ్మెలోనికి దిగుతామని పారిశుధ్య కార్మికులు సంఘం ప్రతినిధులు నీలాపు కనకరాజు, రౌతుయ పైడిరాజు, దనాల సన్నితో పాటు పలువురు కార్మికులు హెచ్చరించారు. తక్షణమే తమకు జీతాలు చెల్లించాలని లేదంటే ఉద్యమానికి సిద్ధం అని వారు తెలిపారు.

నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

నాలుగు నెలల జీతం అందించేందుకు ఏర్పాట్లు

పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన వేతనంలో నాలుగు నెలల జీతం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పారిశుధ్య కార్మికులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- ఇఒ వై ఝాన్సీ

జాగ్రత్తలతోనే కేన్సర్ నివారణ

ప్రజాశక్తి- బొబ్బిలి

జాగ్రత్తలతో కేన్సర్ నివారణ సాధ్యమని రేడియాలజీ అంకాలజిస్ట్ సాంబశివరావు అన్నారు. స్థానిక క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో రోటరీ క్లబ్, ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ ఉచిత పరీక్షా శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొమ్ములో గడ్డలు కట్టినట్లు ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. కేన్సర్ లక్షణాలను ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందన్నారు. కేన్సర్ గుర్తించడంలో నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం ఉంటుందన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జెసి రాజు, వి.శ్రీహరి, కోశాధికారి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ కేన్సర్ నివారణకు అవగాహన సదస్సు నిర్వహించడంతో పాటు ఉచిత స్క్రీనింగ్ శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. స్క్రీనింగ్ శిబిరానికి వచ్చిన మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, పాల్గొన్నారు.

చికిత్స కంటే నివారణ ముఖ్యం

చికిత్స కంటే నివారణ ముఖ్యమని, ఆలస్యంగా గుర్తించటం వల్ల చికిత్స క్లిష్టంగా మారి మరణానికి దారి తీసే పరిస్థితులు సంభవిస్తున్నాయని రేడియాలజీ అంకాలజిస్ట్ డాక్టర్ వెంకట సాంబశివరావు సూచించారు. మంగళవారం స్థానిక ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో బొబ్బిలి రోటరీ క్లబ్, ఎన్ఆర్ఐ హాస్పిటల్ యాజమాన్య సంయుక్త నిర్వహణలో ఉచిత రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు-అవగాహన కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు, ఎన్ఆర్ఐ సిఇఒ ఎస్.శ్రీనివాసన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ సాంబశివరావు బ్రెస్ట్ కేన్సర్ పై అవగాహన కల్పిస్తూ రొమ్ము కేన్సర్‌ను సాధ్యమైనంత త్వరగా గుర్తించటానికి మహిళలు తమ రొమ్ములను క్రమం తప్పకుండా స్వీయ పరీక్ష చేసుకోవాలన్నారు. రొమ్ము పై చర్మం మసకబారటం, చను మొనలపై దద్దుర్లు, చనుమొనలు లోపలికి వెళ్ళటం, చనుమొనలు గుండారక్తపు మరకలు ఉన్న స్రావం కారటం, చంకలో గడ్డలు రావటం మొదలైన లక్షణాలు ఏవైనా రొమ్ము స్వీయ పరీక్షలో కనిపిస్తే వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. అపోహలకు పోకుండా 15 సంవత్సరాలపై బడిన స్త్రీలు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. జనవరి 15 వరకు ఈ ఉచిత రొమ్ము కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో నిర్వహిస్తామని మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అభినవ్, సునీల్, రంగనాధ రెడ్డి, రోటరీ ప్రతినిధులు సజ్జ అప్పల రాజు, శ్రీ హరి, రామకృష్ణ, కృష్ణ మోహన, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ పాదయాత్ర

ప్రజాశక్తి - కొత్తవలస

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వాలని తన స్వగ్రామమైన బొడ్డవరం నుంచి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తిరుమల తిరుపతి దేవస్థానం వరకు సుమారు 820 కిలోమీటర్లు 43 రోజులు సుదీర్ఘ పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర మంగళవారం ముగియడంతో ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా దేశ పాత్రునిపాలెం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద బాన సంచా తో కాంగో డప్పులతో వైసిపి శ్రేణులతో బైక్ ర్యాలీ నిర్వహిం చారు.


ఎమ్మెల్సీకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎస్.కోట, వేపాడ, ఎల్‌కోట, జామి, కొత్తవలస మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని దేశపాత్రునిపాలెం నుంచి బొడ్డవరం వరకు ర్యాలీ చేపట్టారు.

ఎమ్మెల్యే టిక్కెట్లపై అధిష్టానం దృష్టి

శృంగవరపుకోట: ఎమ్మెల్యే టిక్కెట్లను ఇచ్చే విషయంలో అధిష్టానం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. పాదయాత్ర ముగింపు సందర్భ ంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. సర్వేలు జరిపి ఎమ్మెల్యే టిక్కెట్ల ను కేటా యిస్తున్నారన్నారు. ముగింపునకు స్థానిక ఎమ్మెల్యే కడుబండి హాజరు కాకపోవ డంపై పలువురు విలేకరులు ప్రశ్నిం చగా ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభోత్సవం వంటి కార్యక్ర మాల షెడ్యూల్ వల్ల రాలేకపోయారని ఎమ్మెల్సీ చెప్పారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాధం పాల్గొన్నారు.

కులగణన వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన వెంటనే చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. శంకరరావు కోరారు. స్థానిక బృందావనం ఫంక్షన్ హాల్‌లో కులగణన చేపట్టాలని కోరుతూ మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ముగడ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల తరువాత అత్యంత వెనుకబడిన కులంగా బీసీలున్నారన్నారు. ఆక్స్ఫామ్ నివేదిక ప్రకారం దేశంలో 10 శాతం ప్రజల వద్ద 74.3శాతం సంపద ఉందని 40 శాతం ప్రజల వద్ద 22.7 శాతం సంపద ఉందని అన్నారు. 50శాతం మంది ప్రజల వద్ద కేవలం 2.2 శాతం మాత్రమే సంపద ఉందని నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం కులగణన ఓట్ల కోసం చేస్తున్నట్లుగా కనపడుతుంది తప్ప ఎంబీసీలుగా ఉన్న ప్రజల కోసం వాళ్ళ బాగు కోసం చేస్తున్నట్లు కనిపించడం లేదన్నారు. జనవరి 28 సదస్సు తర్వాత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో దాసరి సంఘం నుంచి దాసు, మత్స్యకార సంఘం నుండి కంచి వెంకటరావు, నాయి బ్రాహ్మణ సంఘం నుండి ఆదినారాయణ, చిన్నారావు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్త

చీపురుపల్లి: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్‌పి చైర్మన్


గజపతినగరం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

భోగాపురం: పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

బొబ్బిలి: కాగడ ప్రదర్శనతో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉత్సాహంగా క్రీడా పోటీలు

'ఆడుదాం ఆంధ్రా'ను ప్రారంభించిన జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యేలు, ఎంపిపిలు

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను జిల్లాలో పలు నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో ఎమ్మెల్యేలు,ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు తదితరులు ప్రారంభించారు. చీపురపల్లిలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, భోగాపురంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మరుపల్లిలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, వేపాడ, ఎస్‌కోట మండలాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, మిగతా మండలాల్లో ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. కొన్ని మండలాల్లో వాలంటీర్లు సమ్మె నోటీసు ఇచ్చి క్రీడలకు దూరం కావడంతో వారి స్థానాల్లో పీడీలు, పిఇటిలు క్రీడా పోటీలను నిర్వహించారు. కాగా ఈ పోటీలు సుమారు రెండు నెలలు పాటు జరగనున్నట్లు అధికారులు వెల్లడించారు.

కొత్తవలస: క్రికెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

పూసపాటిరేగ:క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

రామభద్రపురం: పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి

వేపాడ: కబడ్డీ ఆడుతున్న సర్పంచుల సంఘం అధ్యక్షులు